
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

కరీంనగర్ జిల్లా వార్తలు

5

మంగళవారం 22 అక్టోబరు 2024





మోకాళ్లపై నడుస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు


కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయండి



కేంద్ర కార్మిక మంత్రిని సన్మానిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటుచేయాలని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుక్ మాండవీయకు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ సోమవారం వినతి పత్రం అందించారు. న్యూఢిల్లీలో కేంద్ర కార్మిక శాఖమంత్రి మన్సుక్‌మాండవియాను కలిసి కరీంనగర్ జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, ఆసుపత్రి అవసరాన్ని వివరించారు. కరీంనగర్ జిల్లాకేంద్రం మెడికల్ హబ్‌గామారిందన్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి అత్యధికమంది ప్రజలు వైద్యం కోసం కరీంనగర్‌కు వస్తున్నారన్నారు. ఉత్తర తెలంగాణలో బీడి కార్మికులు, నేత కార్మికులు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు అధికంగా ఉన్నారని తెలిపారు.కరీంనగర్ జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయడంతో తమ ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. కేంద్ర కార్మిక మంత్రి సానుకూలంగా స్పందించి ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంటామని హామి ఇచ్చారని బండి సంజయ్‌కుమార్ తెలిపారు.

ఎవరికి వారే..



- కాంగ్రెస్‌లో ఇందిరమ్మ కమిటీల చిచ్చు
- విడివిడిగా జాబితాల సమర్పణ
- కరీంనగర్ నియోజక వర్గంలో గందరగోళం
- సమన్వయ లోపంతో కార్యకర్తల్లో అసంతృప్తి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఏర్పాటు చేయతలపెట్టిన ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయనుంది. ఈ అంశంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా కొత్త చిచ్చును రాజేస్తోంది. విపక్ష ఎమ్మెల్యేలు అధికారంలో ఉన్న నియోజకవర్గాల్లో కొత్త తలనొప్పులు తీసుకొస్తున్నాయి. ఈ నెల 19లోగా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీలో సందడి నెలకొంది. కరీంనగర్ జిల్లాలో మాత్రం విచిత్ర పరిస్థితి నెలకొన్నది. కరీంనగర్, హుజూరాబాద్ అసెంబ్లీ నియోజక వర్గాల్లో బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. చొప్పదండి, మానకొండూర్ నియోజక వర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఈ రెండు నియోజక వర్గాల్లో వారి నేతృత్వంలోనే గ్రామ, పట్టణ ప్రాంతాల ఇందిరమ్మ కమిటీల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. ఆయా నియోజక వర్గాల్లోని గ్రామాల్లో పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న కార్యకర్తలకు చోటు కల్పిస్తూ ఇందిరమ్మ కమిటీలను రూపొందించి జిల్లా ఇన్‌చార్జి మంత్రికి పంపిస్తున్నారు.

● కరీంనగర్‌లో పలు జాబితాలు

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్, హుజూరాబాద్ నియోజక వర్గాల్లో కాంగ్రెస్ గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన కరీంనగర్‌లో ఎవరికి వారు యమునా తీరే అన్నట్లు నాయకులు వ్యవహరిస్తున్నారని పార్టీ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఇక్కడ ఎమ్మెల్యే విపక్ష పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో మంత్రి పొన్నం ప్రభాకర్ కమిటీల ఏర్పాటులో కీలకంగా ఉంటారని, ఆయన సూచనల మేరకే కరీంనగర్, హుజూరాబాద్ నియోజక వర్గాల్లో నియోజకవర్గాల ఇన్‌చార్జిలు కమిటీలు రూపొందిస్తున్నట్లు సమాచారం. మంత్రి ప్రభాకర్ సూచన మేరకు రూపొందించిన జాబితాతోపాటు సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో పది సంవత్సరాలుగా క్రియాశీలంగా వ్యవహరిస్తున్న వారి పేర్లతో 60 డివిజన్ల కమిటీలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డికి అందజేసినట్లు తెలిసింది. నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ తన అనుచరులతో జాబితా రూపొందించి వారికి ఇందిరమ్మ కమిటీల్లో చోటు కల్పించాలని కోరినట్లు సమాచారం.

● ఎవరి జాబితాలు ఆమోదం పొందుతాయో..

హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సఖ్యతగానే ఉంటారు. ఆయన రూపొందించిన జాబితాలు ఆమోదం పొందే అవకాశం ఉంది. కరీంనగర్ కార్పొరేషన్‌కు వచ్చే సరికి పరిస్థితి మారిపోయింది. ఇటీవల కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే వరకు కూడా కాంగ్రెస్ ఉనికి ఈ నియోజక వర్గంలో పెద్దగా లేదు. సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలు మినహా ఎక్కడా కార్యక్రమాలు నిర్వహించలేదు. కాంగ్రెస్‌లో ఉన్న నేతలంతా బీఆర్‌ఎస్‌కు ఇతర పార్టీలకు వలస పోయారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 11 మంది కార్పొరేటర్లు, 10 మంది మాజీ కార్పొరేటర్లు, మరికొందరు సీనియర్ నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ చేరికలతో పార్టీ కొంత క్రియాశీలకంగా మారినా.. వీరితోనే కొత్త తలనొప్పి మొదలయింది. ఇప్పటికే మంత్రి సూచన మేరకు ఒక జాబితా, సుడా చైర్మన్ ఆధ్వర్యంలో మరో జాబితా సిద్ధం కాగా కొత్తగా పార్టీలో చేరిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు తమ తమ డివిజన్లలో తమ అనుచరులతో ఇందిరమ్మ కమిటీలను రూపొందించి ఆ జాబితాలను ఆమోదించాల్సిగా కోరుతూ ఒత్తిడి

మిగతా 8వ పేజీలో... ..

రెండో విడత దళితబంధు విడుదల చేయండి

● మోకాళ్లపై నడిచి నిరసన తెలిపిన లబ్ధిదారులు

సుభాష్‌నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దళితబంధు రెండో విడత నిధులు విడుదల చేయాలని కోరుతూ లబ్ధిదారులు మోకాళ్లపై నడిచి నిరసన వ్యక్తం చేశారు. సోమవారం ప్రజావాణికి వచ్చిన లబ్ధిదారులు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం తమకు మోకాళ్లపై నడిచి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము హుజూరాబాద్ నియోజకవరానికి చెందిన దళితబంధు లబ్ధిదారులమని, తమకు రెండో విడత నిధులు రావాల్సి ఉండగా ప్రభుత్వం ఇంతవరకు ఇవ్వలేదన్నారు. పది నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 26న నిర్వహించే కేబినెట్ సమావేశంలో తమ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

● ప్రజావాణికి 251 దరఖాస్తులు

ప్రజావాణి కార్యక్రమానికి 251 దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారిని నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్‌డీవో మహేశ్వర్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఓటరు జాబితాను సవరించాలి

కరీంనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఓటరు జాబితాను ప్రణాళికాబద్ధంగా సవరించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ స్థానాల ఓటరు విచారణ, ఓటరు జాబితా రూపకల్పనపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు దరఖాస్తుల విచారణను మిషన్ మోడల్‌లో పూర్తి చేయాలన్నారు. ఉమ్మడి కరీంనగర్-మెదక్-ఆదిలాబాద్-కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల స్థానానికి లక్ష దరఖాస్తులు, టీచర్ల స్థానానికి 2,046 దరఖాస్తులు వస్తే పట్టభద్రుల దరఖాస్తుల్లో ఏడు వేలు మాత్రమే విచారణ పూర్తి అయ్యాయన్నారు. పెండింగ్ ఎమ్మెల్సీ స్థానాల ఓటర్ నమోదు దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లను ఓటరు జాబితాలో నవంబరు 6 లోపు నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్ జాబితా సవరణ 2024-25 కోసం స్వీప్ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. దీని కోసం ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలన్నారు. జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ తప్పని సరిగా ఓటు హక్కు కల్పించాలన్నారు. యువ ఓటర్ల నమోదుతోపాటు దివ్యాంగులు, థర్డ్ జండర్, సెక్స్ వర్కర్లు, ఇతర వర్గాల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఓటరు జాబితా రూపకల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలన్నారు. అక్టోబరు 29న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల చేస్తామన్నారు. దీనిపై అభ్యంతరాలను నూతన ఓటరు నమోదు దరఖాస్తులను నవంబరు 29 వరకు స్వీకరిస్తామన్నారు. డిసెంబరు 26 వరకు అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రచురించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్‌లు లక్ష్మీకిరణ్, ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.



ఎస్‌యూను నంబర్‌వన్ యూనివర్సిటీగా తీర్చిదిద్దుతా

- ఎస్‌యూ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఉమేష్ కుమార్

-గణేశ్‌నగర్, ఆంధ్రజ్యోతి

7

వైవిద్య బోధన.. లక్ష్య సాధన

- మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ
- డిజిటల్, ఏఐ సాంకేతికతతో బోధన
- సాహస కృత్యాల్లో జాతీయస్థాయి గుర్తింపు

-తిమ్మాపూర్, ఆంధ్రజ్యోతి





అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీ అభిషేక్ మొహంతి, అధికారులు, నివాళులు అర్పిస్తున్న అమరవీరుల కుటుంబ సభ్యులు

పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివి

- సీపీ అభిషేక్ మొహంతి.
- ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరుల త్యాగాలు మరువలేనివని సీపీ అభిషేక్ మొహంతి అన్నారు. కమీషనరేట్ కేంద్రంలోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద సోమవారం 'ఫ్లాగ్ డే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద సాయుధ బలగాలు గౌరవ వందనం సమర్పించాయి. అనంతరం దేశవ్యాప్తంగా అమరులైన పోలీసులను స్మరించుకున్నారు. పోలీస్ కమీషనర్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులు అర్పించారు. పోలీసు అమరులను స్మరించుకుంటూ రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా సీపీ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ పోలీసు అమరవీరుల దినోత్సవం సంద ర్భం గా దేశ రక్షణకోసం, సమాజంలో శాంతి భద్రతలు కాపాడటంలో భాగం గా విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసులను 'ఫ్లాగ్ డే' సందర్భంగా స్మరించుకుని నివాళులు అర్పించామన్నారు. దేశవ్యాప్తంగా 200 మందికి పైగా పారా మిలిటరీ, రాష్ట్ర పోలీసులు అమరుల య్యార న్నారు. వారి త్యాగాలు ఎప్పటికీ వృథా కావన్నారు. అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలు ప్రశాంతంగా ఉండేలా, శాంతి భద్రతలు కాపాడే విధంగా విధులు నిర్వహిస్తామన్నారు. అమరుల కుటుంబ సభ్యులతో పోలీస్ కమిషనర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసు కున్నారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికా రులకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఎ లక్ష్మీనారా యణ, అనోక్‌జైన్, ఏసీపీ, సీఐ, ఎస్ఐ, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో ఆర్డీవో విచారణ

హుజూరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో నవజాత శిశువు మృతదేహం లభ్యంపై ఆర్డీవో రమేష్‌బాబు సోమవారం విచారణ నిర్వహించారు. నాలుగు రోజుల క్రితం ఏరియా ఆస్పత్రిలోని టాయ్‌లెట్‌లో ఆడ శిశువు మృతదేహం లభ్యమైంది. దీనిపై విచారణ జరపాలని కలెక్టర్ ఆర్డీవోను ఆదేశించారు. దీంతో ఆస్పత్రి సిబ్బందిని ఆర్డీవో రమేష్‌బాబు విచారించారు. ఆస్పత్రిలోని టాయ్‌లెట్‌లోకి శిశువు మృతదేహం ఎలా వస్తుందని సిబ్బందిని నిలదీశారు. ఆస్పత్రిలో సిబ్బంది అప్రమత్తంగా లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో పవన్‌కుమార్, డాక్టర్ దీపా, తహసీల్దార్ కనకయ్య పాల్గొన్నారు.



హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రిలో విచారణ చేపడుతున్న ఆర్డీవో రమేష్‌బాబు

● వైద్యుడికి మెమో జారీ...

హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో విధులపై నిర్లక్ష్యం వహించిన ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్‌కు ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి మెమో జారీ చేసినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం శ్రీనివాస్ విధి నిర్వహణలో భాగంగా రిజిస్టర్‌లో సంతకం చేసి ప్రైవేట్ క్లినిక్‌కు వెళ్లాన్నాడని రాము అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ జరిపి మెమో జారీ చేశారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు.

రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- చొప్పదండిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చొప్పదండి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని రుక్మాపూర్, కొలిమి కుంట, భూపాలపట్నం, వెదురుగట్ట, చొప్పదండిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నాడన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యం తీసుకువచ్చిన రైతులు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమన్నా ఇబ్బందులు కలిగితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

● కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

గన్నేరువరం: రైతులు తమ పంటను తక్కువ ధరకు దళారులకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరను పొందాలని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటలను ఆరబెట్టుకొని తేమ, తాలు లేకుండా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, తహసీల్దారు ఇప్ప నరేందర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీఎం లావణ్య, ఏవో కిరణ్మయి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా నాయకులు కొమ్మెర రవిందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



చొప్పదండిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి

ఐద్వా రాష్ట్ర సభలకు కరీంనగర్ ప్రతినిధులు



రాష్ట్ర మహా సభలకు వెళుతున్న ఐద్వా సభ్యులు

భగత్‌నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐద్వా రాష్ట్ర మహాసభలకు కరీంనగర్ ప్రతినిధి బృందం సోమవారం బయలుదేరి వెళ్లింది. ఈ నెల 21, 22, 23 తేదీల్లో ఖమ్మం జిల్ల కొత్తగూడెంలో జరగుతున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు జరుగుతున్నాయి. రాష్ట్ర మహాసభల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షులు ద్యావ అన్నపూర్ణ, పొంద్రాళ్ల దేవేంద్ర, నగర కార్యదర్శులు చేని రోజారాణి, ఎడ్ల రజిత, వసంత వెళ్లారు.

క్రైం కార్నర్

భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ సోమవారం సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించారు. దోమకొండ మండలం తుల్జాపూర్‌కు చెందిన సుంకరి రాజుకు ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన మేఘమాలతో 2010లో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కొంతకాలం తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని భర్త వేధింపులకు గురిచేశాడు. 2015లో ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో భర్త రాజుపై ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై మారుతి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పీపీ సందీప్ వాదించగా ముస్తాబాద్ ఎస్సై గణేశ్, సీఎంస్ ఎస్సై రవీందర్‌నాయుడు, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితుడు సుంకరి రాజుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు చెప్పారు.

గంభీరావుపేటలో యువకుడి అదృశ్యం

గంభీరావుపేట, అక్టోబర్ 21: (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంలోని దోసల గూడెంకాలనీకి చెందిన బరిగెల బాబు అనే యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ నెల 19న ఇంటి నుంచి వెళ్లిన బాబు తిరిగి రాలేదు. బాబు కోసం మూడు రోజులుగా కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. ఆచూకీ లభ్యం కాక సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అనారోగ్యంతో 'కేశోరాం' కార్మికుడి ఆత్మహత్య

పాలకుర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేశోరాం వర్కర్స్ కాలనీలో నివాసముంటున్న కంపెనీ కార్మికుడు ఆదివారం రాత్రి ఉరేసుకొని మృతి చెందినట్లు బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి తెలిపారు. ఎస్‌ఐ సోమవారం వివరాలను వెల్లడించారు. కన్నం కేశవులు(55) కంపెనీలో పర్మినెంటు వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజులుగా బీపీ, షుగర్, ఇతర అనారోగ్య సమస్యలతో విధులకు సరిగా హాజరు కాలేదు. దీంతో మనోవేదనకు గురై తన క్వార్టర్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కేశవులు తండ్రి కన్నం నాగయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఆదివారం బసంత్‌నగర్ తెలుగు మీడియం పాఠశాలలో జరిగిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన అదే రోజు రాత్రి ఆత్మహత్య చేసుకోవడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధుడు సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మ వెంకన్న(65) వృద్ధుడు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కొంత కాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం గ్రామంలోని స్వంత కొట్టంలో దులానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య దేవవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్పత్రికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

● తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని అసుపత్రిలో చూపించి తిరిగి ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులిద్దరూ తీవ్రంగా గాయపడిన సంఘటన సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై సోమవారం జరిగింది. పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేటకు చెందిన మల్లేశంను ఆస్పత్రిలో చూపించడం కోసం ఆయన కొడుకు మధునయ్య బైక్‌పై కరీంనగర్ వెళ్లారు. తండ్రిని అస్పత్రిలో చూపించి మందులు తీసుకుని తిరిగి సోమవారం రాత్రి స్వగ్రామానికి వస్తుండగా వీరి బైక్‌ను వెనక నుంచి వేగంగా వస్తున్న ఇసుక లారీ భూపతిపూర్ స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రికి కుడి కాలు తెగిపడిపోగా, కొడుకకు కాళ్లకు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే కరీంనగర్ అస్పత్రికి అంబులెన్సులో తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ ఆగకుండా వెళ్లిపోయిందని గ్రామస్థులు తెలిపారు.

భూమి అమ్మి మోసం చేసిన వారిపై కేసు

వీణవంక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భూమి అమ్మి కొంత భూమి రిజిస్ట్రేషన్ చేసి మిగతా భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. హిమ్మత్‌నగర్ గ్రామస్థుడైన మేక రమేష్‌కు కరీంనగర్‌కు చెందిన అన్‌రెడ్డి ప్రకాష్‌రెడ్డి అన్‌రెడ్డి అరుణ వారికున్న ఏడెకరాల 19 గుంటలు రూ. 71 లక్షల 50 వేలకు అమ్ముతామని నమ్మబలికి మొత్తం రూపాయలు ముట్టిన తర్వాత ఐదు ఎకరాల 32 గుంటలు మాత్రమే పట్టా చేశారని తెలిపారు. మిగతా భూమిని పట్టా చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని, రిజిస్ట్రేషన్ చేయమని అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారని, తన వద్ద పైసలు తీసుకొని మోసం చేశారని మేక రమేష్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

వెల్గటూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కట్రావుపేట గ్రామానికి చెందిన మేకల రాజయ్య(40) అనే వ్యక్తి సోమవారం అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు రాజయ్య కొద్ది కాలంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఉదయం ఇంటిలో అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నట్లు కుటుంబీకులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి సోదరుడు మేకల మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మృతికి గల కారణాలు తెలుసుకోవడానికి శవాన్ని పంచనామా నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోతనకాలనీకి చెందిన మంథని ప్రవీణ్‌కుమార్ (29) అదృశ్యమైనట్టు గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు. 2 ఇంక్లయిన్ గనిలో పనిచేస్తున్న ప్రవీణ్‌కు ఇటీవల నిశ్చితార్థం జరిగింది. బంధువు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లి సోమవారం తెల్లవారు జామున ఇంటికి వచ్చే సరికి ప్రవీణ్ కనిపించలేదు. ప్రవీణ్ మొబైల్ స్విచ్ ఆఫ్ రావడంతో ఇరుగు పొరుగు వారికి, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ప్రవీణ్ తండ్రి మంథని రాజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్టు

చందుర్తి, కోనరావుపేట, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : గంజాయి సరఫరా కేసులో పరారీలో ఉన్న ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామ శివారులో జూలై 25న కావేరి కాటన్ మిల్ వద్ద గంజాయి సరఫరా చేస్తున్న ఏడుగురిపై కేసు నమోదైంది. వారిలో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపారు. ఈ కేసులో మర్తనపేట గ్రామానికి చెందిన నీరటి సాయికుమార్ పరారీలో ఉండగా సోమవారం రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

91 గ్రాముల గంజాయి స్వాధీనం

మంథని, అక్టోబర్ 21: స్థానిక బస్ డిపో సమీపంలో మంథనిలోని పోచమ్మవాడకు చెందిన కుదుదుల సూర్యవర్ధన్‌అనే యువకుడి వద్ద నుంచి 91 గ్రాముల ఎండు గంజాయిని సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. తమకు అందిన సమాచారంతో తాము బస్ డిపో సమీపంలో చూడగా సూర్యవర్ధన్ అనుమానాస్పదంగా ఉండి తమను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకొని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్ తనిఖీ చేయగా 91 గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ వెళ్లి తనకు పరిచయం ఉన్న కీర్తిక్ అనే వ్యక్తి దగ్గర గంజాయి కొనుగోలు చేసినట్లు సూర్యవర్ధన్ వెల్లడించారన్నారు. తన వద్ద ఉన్న గంజాయిని స్థానిక శ్రీపాదకాలనీలో తనకు పరిచయస్థులైన తైదల సురేష్, పెండ్యాల సునీల్, ఆసంపెల్లి తరుణ్, లక్క రవివర్మలతో కలిసి గత కొంత కాలంగా గంజాయిని తాగున్నట్లు సూర్యవర్ధన్ వెల్లడించినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానము

రైతు నేస్తం..

వ్యవసాయ అభివృద్ధి, రైతుల శ్రేయస్సే ధ్యేయంగా జగిత్యాల జిల్లాలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం పనిచేస్తోంది. వ్యవసాయ రంగంలో ఉత్తర తెలంగాణకు పొలాల క్షేత్రం తలమానికంగా నిలుస్తోంది. ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయానికి అనుబంధంగా వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేశారు. కళాశాలలో బీఎస్సీ, ఎమ్మెస్సీ అగ్రికల్చర్ స్పెషలైజేషన్, జెనెటిక్స్ తదితర కోర్సులను అందిస్తున్నారు. ఇక్కడ కోర్సు పూర్తి చేసుకున్న పలువురు విద్యార్థులు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో పలు ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇక్కడ తయారైన పలు రకాల విత్తనాలు రాష్ట్ర స్థాయిలో ప్రాచుర్యం పొందాయి. ఎప్పటికప్పుడు అధిక దిగుబడిని అందించే కొత్త కొత్త వంగడాలను సృష్టిస్తూ పరిశోధన స్థానం తనదైన ప్రత్యేకతను చాటుకుంటోంది.

పొలాస క్షేత్రం

ఉత్తర తెలంగాణకు తలమానికంగా వ్యవసాయ కేంద్రం

- అనుబంధంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల
- వ్యవసాయ డిగ్రీ, పీజీ కళాశాలలు



జగిత్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొలాస ప్రాతీయ వ్యవసాయ పరిశోధన క్షేత్రా నికి ప్రత్యేక స్థానం ఉంది. 1983 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పరిశోధన స్థానాన్ని ప్రారంభించారు. సుమారు 48.96 హెక్టార్ల విస్తీర్ణంలో పరిశోధన స్థానం ఉంది. ఈ కేంద్రం పరిధిలో కరీంగనర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల పరిశోధన క్షేత్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ పరిశోధన స్థానం తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు చెందిన రైతులకు అవసరమైన సేవలు అందిస్తోంది. కళాశాల నూతన వంగడాలపై పరిశోధనలు చేస్తూ, రైతులకు సాగులో మెళకువలు చెప్తూ, సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు అందిస్తూ రైతు నేస్తంగా పొలాస వ్యవసాయ పరిశోధన క్షేత్రం కృషి చేస్తోంది. పలు ఆటు పోట్లను అధిగ మిస్తూ ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యంత ఉత్తమ ప్రదర్శన క్షేత్రంగా ఖ్యాతి గడించడం పట్ల జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వ్యవసాయ ప్రయోగాలు చేస్తున్న ప్రొఫెసర్లు, విద్యార్థులు

అనుబంధ కళాశాలలు ఇవీ..

పొలాస వ్యవసాయ పరిశోధన స్థానానికి అనుబంధంగా 2008 సంవత్సరంలో వ్యవసాయ డిగ్రీ కళాశాల, 2013లో వ్యవసాయ పీజీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు అయ్యాయి. వ్యవసాయ కళాశాలలో 150 సీట్లు, పీజీలో 14 సీట్లు ఉన్నాయి. ఈ కళాశాలలో ప్రవేశం పొందు తున్న వారిలో అధికంగా బాలికలు ఉంటున్నారు. బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల ప్రారంభం అయ్యింది. పక్కా భవనం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థులకు రూ. 20 కోట్లతో పక్కా భవనం నిర్మించడంతో సమస్య సద్దుమణిగింది. ప్రస్తుతం వ్యవసాయ కళాశాలలో ప్రతీ యేటా సుమారు 150 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు. ఒకే ప్రాంగణంలోనే వ్యవసాయ డిగ్రీ, పీజీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ఉండడం వ్యవసాయ విద్యావ్యాప్తికి దోహదపడుతోంది.

తొలినాళ్లలో అవస్థలు, అసౌకర్యాలతో ఇబ్బందులు పడ్డ పరిశోధన స్థానం నేడు అన్ని హంగులతో వ్యవ సాయరంగంలో ఒక వెలుగు వెలుగుతూ రైతన్నలకు పరిశోధన ఫలాలు పంచుతూ జిల్లాకే తలమాణికంగా నిలుస్తోంది. కార్యాలయ నిర్వహణతో పాటు, పరిశోధనలకు సైతం ఊతం ఇస్తూ వంగడాల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ముందు వరుసలో ఉన్నారు. ఏటా విత్తన మేళా నిర్వహించి రైతులకు అవసరమైన విత్తనాలను అందిసున్నారు.

అధిక దిగుబడినిచ్చే విత్తనాల కోసం..

ప్రధానంగా జిల్లాకు ఆయువుపట్టుగా ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద పండే పంటలైన వరి, మొక్కజొన్న, నువ్వులు, వేరుశనగ పంటలకు సంబంధించి అధిక దిగుబడినిచ్చే విత్తనాలు, కీటకాలు, చీడ పీడలను, వాతావరణ పరిస్థితులను తట్టుకొని నిలబడి, రైతుకు లాభాలు ఇచ్చే పంటల విత్త నాలను పరిశోధన కేంద్రంలో కనిపెడుతున్నారు. వీటిని రైతులతో పాటు ప్రభుత్వం ద్వారా ప్రైవేటు విత్తన సంస్థలకు అందజేస్తారు. జగిత్యాల పరిశోధన స్థానంలో తయారైన పలు వరి, మొక్కజొన్న, నువ్వు విత్తనాలు రాష్ట్ర స్థాయిలో ప్రాచుర్యం పొందాయంటే పరిశోధనల ఫలితం, శాస్త్రవేత్తల కృషికి అద్దం పడుతున్నాయి.



క్షేత్ర స్థాయి వ్యవసాయ పనుల్లో కళాశాల విద్యార్థులు

మేలైన వంగడాలకు కేరాఫ్‌గా...

రైతులెంత చెమటోడ్చినా వేలకు వేలు పెట్టుబడి పెట్టిన దిగుబడి లేక నష్టాల్లో దిగబడి పోతున్నారంటే నాణ్యమైన వంగడాలు అందక పోవడమే కారణం అని భావిస్తున్నారు. ఈ సమస్యను అధిగమించడం పై పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. వరి ప్రధాన పంటగా సాగుచేస్తున్న తెలంగాణ రాష్ట్రంలో వరి పరిశోధనలకు కేంద్ర బిందువుగా నాణ్యమైన విత్తనాలను అందించడమే లక్ష్యంగా జగిత్యాల జిల్లాలో గల పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం పని చేస్తుంది. ఇక్కడ రూపొందించిన విత్తనాలు తెలంగాణతో పాటు ఉత్తర భారత దేశంలో సాగులో ఉండడం గమనార్హం.

ఇక్కడి నుంచి వరిలో జగిత్యాల సన్నాలు, పొలాస ప్రభ, జగిత్యాల సాంబ, కరీంనగర్ సాంబ, జగిత్యాల మసూరి, ప్రాణహిత, మానేరు, బతుకమ్మ రకాలను విడుదల చేశారు. నువ్వుల్లో హిమ చందన, రాజేశ్వరీ, స్వేతాతిల్, పసుపులో సుగుణ, సుదర్శన వేరుశనగలో జేజీఎల్ 98 రకాలను శాస్త్రవేత్తలు రూపొందిం చారు. పంటల సరళి, కొత్తకొత్త రకాలతో ఈ పరిశోధన స్థానం విశేష స్థానం పొందింది. పరిశోధన ఫలాలను అన్నదాతల క్షేత్రాలకు చేరవేసే శాస్త్రవేత్తలు నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ వంగడాలన్నీ ఉల్లి కోడును, అగ్గి తెగులును సమర్థవంతంగా ఎదుర్కోగలిగే సామర్థ్యం ఉన్నవే కావడంతో రైతుల్లో మంచి స్పందన లభిస్తుంది. అనేక రకాల వరి, ఇతర వంగడాలపై పరిశోధనలు, ప్రదర్శనలు ఏటా జరుగుతుండడం, రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించడం, సాగులో మెళకులవలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తూ దినదినాభివృద్ధి చెందుతోంది.



జెజీఎల్ 28545 సన్న వరి గింజ రకం ప్రదర్శన

న్యాయం చేయాలని బాధిత కుటుంబీకుల ఆందోళన

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తన భర్తను చంపింది ఒక్కరు కాదు, ముగ్గురని వారిపై చర్యలు తీసుకోకుంటే ఆత్మహత్య చేసుకుంటానంటూ డీజిల్ డబ్బాతో మృతుడి భార్య బంధువులతో కలిసి సోమవారం పట్టణంలో ఆందోళన చేపట్టింది. మల్లాపూర్ మండలం ఓబులాపూర్ గ్రామానికి చెందిన పల్లపు సాయిలును తమ్ముడు ఆదివారం హతమార్చాడు.

అయితే మృతుడు సాయిలును చంపింది సాయిలు తమ్ముడితో పాటు మరో ఇద్దరు ఉన్నారని మృతుడి భార్య నవ్య ఆరోపిస్తూ తమ కుటుంబానికి న్యాయం చేసే వరకు మృతదేహాన్ని తీసుకెళ్లేది లేదని మొదట మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి ముందు నిరసనకు దిగింది. అనంతరం బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నవ్య మాట్లాడుతూ తన భర్త సాయిలును మొత్తం ముగ్గురు కలిసి పక్కా ప్రణాళిక ప్రకారమే హత్య చేశారని ఆరోపించారు. మృతుడి మెడలో తులం బంగారం, 40 వేల విలువగల ఫోన్. పది వేల నగదు లాక్కొని తన భర్తపై ఇద్దరు తమ్ముళ్లు, మరో మేకల మంద యాజమానితో కలిసి హత్య చేశారని తెలిపింది. గతంలో భూ వివాదాలు ఉండేవని గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగాయని, కేసులు కూడా నమోదయ్యాయని ఆమె తెలిపింది. తన భర్త మృతి చెందడంతో ఇద్దరు కూతుళ్లకు ఆధారం లేదని కన్నీరు మున్నీరైంది. తన పిల్లలకు న్యాయం చేయాలని లేదంటే డీజిల్‌తో నిప్పంటించుకుంటానని ఆమె హెచ్చరించింది. సంఘటన స్థలానికి డీఎస్పీ ఉమామహేశ్వరరావు చేరుకుని బాధితురాలు నవ్యతో మాట్లాడి న్యాయం జరిగే లా చూస్తామని నిందితులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ కిరణ్ కుమార్‌లు ఉన్నారు.



డీజిల్ డబ్బాతో ఆందోళన చేస్తున్న మృతుడి భార్య నవ్య

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

మంథని, అక్టోబరు 21: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మంథని జేకేఏ షోటోకాన్ కరాటే విద్యార్థులు ఎంపికైనట్లు ఇన్‌స్ట్రక్టర్ కోండ్ర నాగరాజు సోమవారం తెలిపారు. గోదావరిఖని ఆర్‌సీఓఏ క్లబ్‌లో పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ కొమురోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా 68వ ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలు జరిగాయి. ప్రతిభను కనబర్చిన తమ విద్యార్థులు అండర్-14 విభాగంలో వడ్లకొండ శ్రీనిత, అండర్-17 విభాగంలో తోట హాసిని, రాగుల సహస్ర, బేరా ఆదిత్య తేజ, పొట్ల శ్రావణ్‌కుమార్, డుల్‌గచ్ దేవాన్ష్, రంగు శ్రీచరణ్‌లు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలకు ఎంపి కైనట్లు తెలిపారు. వీరిని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, జేకేఏ సౌత్ జోన్ ఇంచార్జి రాపోలు సుదర్శన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శ్రీనివాస్ అభినందించారు.

అరటి పండ్ల గోదాంపై దాడులు

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎండి ఉస్మాన్ అలీ బ్రదర్స్ ఫ్రూట్స్ గోదాంలో సోమవారం ఫెడ్ఇన్‌స్పెక్టర్ అనూష సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాంలో నిల్వ ఉంచిన అరటి పండ్లను పరిశీలించారు. అరటి పండ్లు త్వరగా పక్వానికి రావడానికి విషపూరితమైన ఇథిలీన్‌ను అతిగా వాడుతున్నట్లు గుర్తించి గోదాంను సీజ్ చేసినట్లు తెలిపారు.

గోదావరిలో మునిగిన ఇసుక ట్రాక్టర్

మల్లాపూర్, అక్టోబరు, 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని వాల్గొండ సమీపంలోని గోదావరిలో సోమవారం ఓ ఇసుక ట్రాక్టర్ నీట మునిగింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి అధికారులు సోమవారం ఉదయం నీటిని విడుదల చేశారు. అధికారులు ఈ విషయంపై గోదావరి తీర ప్రాంత ప్రజలకు సమాచారం అందించారు. కొందరు ఇసుక వ్యాపారులు కూలీలతో కలిసి ట్రాక్టర్ తీసుకొని గోదావరి నదిలోకి ఉదయం వెళ్లారు. ట్రాక్టర్‌లో ఇసుక నింపుతుండగానే ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగిం ది. కూలీలు, డ్రైవర్ ట్రాక్టర్‌ను అక్కడే వదిలేసి ఒడ్డుకు చేరుకున్నారు. గోదావరిలో మునిగిన ట్రాక్టర్‌కు గజ ఈతగాళ్లు తాడు కట్టి ఎక్స్‌కవేటర్ సహాయంతో ఒడ్డుకు తీసుకొచ్చారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సుల్తానాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెయింట్ మేరీస్ స్కూల్‌కు చెందిన కాంపల్లి శ్రీలక్ష్మి ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో తన ప్రతిభను చాటుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. లక్ష్మిని ఫాదర్ షౌరెడ్డి అభినందించారు. సిరిసిల్లలో మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణలో కూడా పాల్గొని త్వరలో మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటుందని ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఇండియన్ పబ్లిక్‌స్కూల్‌కు చెందిన ఎస్ శ్వేత, డి.ప్రియదర్శిని కూడా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్కూల్ చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ క్రిష్ణప్రియ తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఖోఖో ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో వీరిద్దరు ప్రతిభ చాటుకుని రాష్ట్ర పోటీలకు అర్హత సాధించారని తెలిపారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

దుబాయ్‌లో చేనేత కళాకారుడి వస్త్ర ప్రదర్శన



హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు



హరిప్రసాద్ నేసిన వస్త్రాలు

సిరిసిల్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల చేనేత వస్త్ర పరిశ్రమలో అద్భుతాలు ఆవిష్కరిస్తున్న యెల్ది హరిప్రసాద్ మగ్గంపై నేసిన వివిధ వస్త్రాలను సోమవారం దుబాయ్‌లో దుబాయ్ ఎమిరేట్స్ పద్మశాలి అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. వస్త్రంపై మనుషుల బొమ్మలు, జీ 20 లోగో, అగ్గిపెట్టెలో అమిరే చీర వంటి వాటిని ప్రదర్శనలో ఉంచారు. సిరిపట్టు చీరలు, అంతరించిపోతున్న పీతాంభరం చీరతోపాటు నూలు పోగుల అల్లికలతో తయారు చేసిన చిత్రపటాల ప్రదర్శన అందరినీ అకట్టుకుంది. ఈ సందర్భంగా నేత కళాకారుడు హరిప్రసాద్‌ను అసోసియేషన్ ప్రతినిధులు గుత్తికొండ రవిచంద్ర, సరస్వతి సన్మానించారు.

రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌లో

కరీంనగర్‌కు కాంస్య పతకం



ఐజీ అవినాష్ మొహంతి నుంచి కాంస్య పతకం అందుకుంటున్న సీఐడీ కానిస్టేబుల్ శ్రీనివాస్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌లో కరీంనగర్ పోలీస్ శాఖకు కాంస్య పతకం దక్కింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో పోలీసు డ్యూటీ మీట్ ఏర్పాటు చేశారు. జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన డ్యూటీ మీట్‌లో పతకాలు పొందిన పోలీసులకు రాష్ట్రస్థాయి హైదరాబాద్‌లో పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించారు. ఈ డ్యూటీ మీట్‌లో ఫొటోగ్రఫీ విభాగంలో కరీంనగర్ సీఐడీ కానిస్టేబుల్ కాసుల శ్రీనివాస్‌కు కాంస్య పతకం దక్కింది. దీనితో పాటు ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌కు శ్రీనివాస్ ఎంపికయ్యారు. వచ్చే నెలలో జార్ఖండ్ రాష్ట్రంలో నిర్వహించే ఆలిండి యా పోలీస్ డ్యూటీ మీట్‌లో శ్రీనివాస్ పాల్గొననున్నారు. శ్రీనివాస్‌కు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఐజీ అవినాష్ మొహంతి కాంస్య పతకం అందజేశారు.

సియోల్‌లో మంత్రుల బృందం

● వేస్టు టూ ఎనర్జీ ప్రాజెక్టు సందర్శన



సియోల్‌లో మంత్రుల బృందం

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చెత్తను రీసైకిల్ చేసి విద్యుత్‌గా మార్చే వేస్ట్ టు ఎనర్జీ(డబ్ల్యుటీఇ) కేంద్రాలను సందర్శించేందుకు రాష్ట్ర మంత్రుల బృందం సోమవారం దక్షిణ కొరియాలోని సియోల్‌కు చేరుకుంది. అక్కడ వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టును మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, కాలె యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి పరిశీలించారు.

సౌత్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ




పతకాలు సాధించిన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 21: ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించిన 35వ సౌత్ ఇండియా జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఎం వినయ్ 3 వేల మీటర్ల పరుగు పందెం లో సిల్వర్ మెడల్, జి నక్షత్ర అండర్-14 బాలికల ట్రైథ్లాన్ విభాగంలో సిల్వర్ మెడల్, విష్ణువర్ధన్ 10 వేల మీటర్ల నడక పోటీల్లో బ్రాంజ్‌మెడల్ సాధించా రు. ఈ సందర్భంగా విద్యార్థులను, కోచ్‌లు వరుణ్ కృష్ణన్, తిరుపతిలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవిలు అభినందించారు.

- మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ
- డిజిటల్, ఏఐ సాంకేతికతతో బోధన
- సాహస కృత్యాల్లో జాతీయస్థాయి గుర్తింపు
- చారిత్రక ప్రదేశాల పర్యటన

వైవిధ్యంగా బోధించడంతో పాటు.. విద్యార్థులు లక్ష్య సాధన దిశగా అడుగులు వేయడానికి ఆ పాఠశాల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. తిమ్మాపూర్ మండలంలోని మల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ బోధనతో పాటు ఏఐ సాంకేతికతను జోడించి ప్రత్యేకంగా వివిధ అంశాలపై వీడియో పాఠాలు బోధిస్తున్నారు. తరగతి బోధనే కాకుండా విద్యార్థులను చారిత్రక ప్రదేశాలకు తీసుకువెళ్లి అక్కడి విశేషాలను తెలియజేస్తున్నారు. సాహస కృత్యాల్లో శిక్షణ ఇచ్చి వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపుతున్నారు.



ఏఐ సహాయంతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

వైవిధ్య బోధన.. లక్ష్య సాధన

తిమ్మాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : తరగతి గది బోధన మాత్రమే కాకుండా విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారు.. మల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు. డిజిటల్ బోధన, ఏఐ సాంకేతికత జోడించి వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. తరగతి గదుల్లోనే కాకుండా క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. శారీరకంగా, మానసి కంగా ధృఢంగా ఉండేలా విద్యార్థులకు సాసహకృత్యాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. చారిత్రక ప్రదేశాల పర్యటనకు తీసుకువెళ్లి వారికి అవగాహన కల్పిస్తున్నారు. మల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు మొత్తం 50 మంది విద్యార్థులు ఉండగా, ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఉన్నారు.



రాష్ట్ర మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ చేతుల మీదుగా లీడర్ ట్రైనర్‌గా సర్టిఫికేట్ అందుకుంటున్న షరీఫ్ అహ్మద్



లాగ్ అండ్ టైర్ బ్రిడ్జిలో శిక్షణ పొందుతున్న విద్యార్థి

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

తరగతి పాఠాలే కాకుండా వివిధ అంశాలపై విద్యార్థులకు బోధిస్తున్నారు. వారానికి ఒకటి, రెండు రోజులు మార్చ్ ఫాస్ట్, కథంతాల్, ఫుట్‌డ్రిల్, స్మార్ట్‌నెస్, గుడ్ ఆర్డర్ నేర్పిస్తున్నారు. పాఠశాలకు చెందిన 9మంది విద్యార్థులు జాతీయ యూత్ అడ్వెంచర్ కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చాటారు. 30 అడుగుల ఎత్తైన కొలంటో బ్రిడ్జ్ క్రాసింగ్, జిప్ లైనింగ్, రాక్ క్లైంబింగ్, అర్చరీ వంటి సాహసోపేత కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విద్యార్థులకు వాస్తవ ప్రపంచం చూపించడమే లక్ష్యం

షరీఫ్ అహ్మద్, హిందీ ఉపాధ్యాయుడు



విద్యార్థులకు పాఠ్యాంశాలను కేవలం పుస్తకాల్లోనే కాకుండా వాస్తవ ప్రపంచం చూపించడం మా లక్ష్యం. నేను విధులు నిర్వర్తించిన ప్రతి పాఠశాలలో విద్యార్థులు తమ ప్రతిభను చాటి ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఇప్పటి వరకు మొత్తం 12 మంది విద్యార్థులు గవర్నర్ అవార్డులు, 32 మంది విద్యార్థులు ప్రధాన మంత్రి అవార్డులు, ఒక విద్యార్థి రాష్ట్రపతి అవార్డు తీసుకున్నారు. విద్యార్థులకు ప్రోత్సాహం అందించేందుకు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరిస్తున్నారు.

అనుభవం మరింత ధైర్యాన్ని ఇచ్చింది

పి.రశ్మిత, 8వ తరగతి



పాఠశాలలో విద్యతో పాటు వివిధ రకాల శిక్షణ అనుభవం నాకు మరింత ధైర్యం అందించింది. టీమ్ గా కలిసి పనిచేసినప్పుడు నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. మేము కలిసి కష్టాలను ఎదుర్కొన్నప్పుడు అద్భుతమైన అనుభూతి, అనుభవం ద్వారా మిత్రుల మధ్య బంధం ఎంత ముఖ్యమో గుర్తించాను. ప్రతి కృషి విజయాన్ని అందించింది.

● వీడియో పాఠాలు

ప్రభుత్వం కొన్ని పాఠశాలల్లో డిజిటల్ బోధనకు ఏర్పాట్లు చేస్తుండగా మల్లాపూర్ పాఠశాలలో కూడా డిజిటల్ బోధన అందిస్తున్నారు. రికార్డెడ్ పాఠాలు బోధించడంతో పాటు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్)ను ఉపయోగించి వివిధ అంశాలపై వీడియోలు రూపొందించి విద్యార్థులకు అందిస్తున్నారు. సుల భంగా పాఠాలు అర్థమయ్యేలా వీడియోలు రూపొం దిస్తున్నారు. చదువుతో పాటు సమాజంలో ఎలా ఉండలానే దానిపై విద్యార్థులకు మానవీయ విలువలను తెలుపుతూ వీడియోలను తరగతి గదిలో ప్రదర్శిస్తున్నారు. తల్లిదండ్రులు, అంధులు, అంగవైకల్యం, మహిళలు, పసిపిల్లలు, వృద్ధాప్యంలో ఉన్నవారికి ఎలాంటి గౌరవం ఇవ్వాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు.



మానవీయ విలువ పై విద్యార్థుల ప్రదర్శన

సాహస కృత్యాలు నాలోని భయాలను పోగొట్టింది

ఆర్.మహేష్, 9వ తరగతి,



మా పాఠశాలలో చదువుతో పాటు వివిధ అంశాల పై శిక్షణ ఇస్తుండటంతో ప్రతిరోజు పాఠశాలకు వెళ్లాలనిపిస్తుంది. సాహస కృత్యాలతో నాలోని భయం పోయింది. ఇప్పుడు నేను కొత్త కష్టాలను ఎదుర్కోవడానికి ధైర్యంగా ఉన్నాను. పాఠశాలలో మేము ఎంతో సంతోషంగా ఉన్నాం.



షూటింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థిని



ఆర్చరీలో శిక్షణ పొందుతున్న విద్యార్థి

మా సర్ ప్రోత్సాహం ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది


ఎం.భువన్ తేజ్, 7వ తరగతి




పాఠశాల అంటే భయం పోయింది. నాకు మా సర్ ఎంతో ప్రోత్సాహాన్ని అందించారు. నాకు ఈ అనుభవం చాలా ప్రత్యేకంగా ఉంది. నాకు స్నేహితులను సహాయం కోరడం ఎంత ముఖ్యమో చూపించింది. ఇలాంటి అనుభవం ద్వారా స్నేహితుల సహకారం, మద్దతు మన విజయానికి ఎంత కీలకమైనదో అర్థం చేసుకున్నాను.

చారిత్రక అంశాలపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు ప్రేరణ ఇచ్చేందుకు వివిధ చారిత్రక ప్రదేశాలకు తీసుకువెళ్లి అక్కడ ఉన్న కట్టడాలను వారి చరిత్రను ప్రత్యేకతలను తెలుసుకునే విధంగా అవకాశం కల్పిస్తున్నారు. ఢిల్లీ, అగ్రాలోని ప్రధాన చారిత్రాత్మక ప్రదేశాలు ఎర్రకోట, లోటస్ టెం పుల్, కుతుబ్ మినార్, ఇండియా గేట్, రాష్ట్రపతి భవన్, అక్షర్‌ధామ్ టెంపుల్, తాజ్‌మహల్, అగ్రా కోటను సందర్శించా రు. హర్యానాలో పర్యటించిన విద్యార్థులు హర్యానాలోని మోడల్ పాఠశాలలను సందర్శించి, స్థానిక విద్యార్థులతో కలిసి కొత్త అనుభవాలు తెలుసుకున్నారు.



మల్లాపూర్ పాఠశాల భవనము, పక్కనే ఎత్తయిన గుట్ట



చారిత్రక ప్రదేశాల పర్యటనలో భాగంగా..

ఎస్‌యూను నంబర్‌వన్ యూనివర్సిటీగా తీర్చిదిద్దుతా

- నాక్ గుర్తింపు తీసుకురావడమే లక్ష్యం
- త్వరలోనే రెండు ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుకు కృషి
- నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీని రాష్ట్రంలోనే నంబర్‌వన్ యూనివర్సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ తెలిపారు. వీసీగా నియామకమయ్యాక సోమవారం మొదటిసారిగా ఆయన శాతవాహన యూనివర్సిటీకి రాగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ వరప్రసాద్ పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. వీసీ చాంబర్‌లో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ కుటుంబ సభ్యులతో కలిసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం మొదటి ఫైల్‌పై సంతకం చేశారు. బాధ్యత స్వీకరణ అనంతరం పలువురు యూనివర్సిటీ అధికారులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీకి న్యాక్ గుర్తింపు తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు. యూనివర్సిటీలో రెండు ఇంజనీరిం గ్ కళాశాలల ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు కావాల్సిన స్థలం మనకు అందుబాటులో ఉన్నదని తెలిపారు. యూనివర్సిటీలో కొత్త కోర్సులు, విద్యార్థులకు ఉపయోగపడే, జాబ్ ఓరియంటడ్, మల్టీ డిసిప్లేనర్ కోర్సుల ప్రవేశానికి ప్రత్యేకంగా దృష్టి పెడతామన్నారు. ఇందులో ఏ కోర్సు నుంచి ఏ కోర్సుకైనా వెళ్లాలా అవకాశం ఉంటుందన్నారు. తాను రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో యూనివర్సిటీలో స్నాతకోత్సవం నిర్వహించామన్నారు. గవర్నర్, ఛాన్స్‌లర్ జిష్ణు దేవ్‌వర్మను ఆహ్వానించి రెండో స్నాతకోత్సవ నిర్వహణకు చర్యలు తీసుకుంటానని వీసీ తెలిపారు. యూనివర్సిటీ సమస్యలను పలువురు ఇప్పటికే తన దృష్టికి తీసుకువచ్చారని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. యూనివర్సిటీలో బీఈడీ, ఎం ఈడీ కళాశాలల ఏర్పాటు విషయం కూడా పరిశీలిస్తామన్నారు. కార్యక్ర మంలో రిజిస్ట్రార్ ఎం.వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై.కిషోర్, ప్రసాద్, పరీక్షల నియంత్రణాధికారి ఎస్వీ శ్రీరంగ ప్రసాద్, యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎండీ జాఫర్ జారీ, యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ హరికాంత్, యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జయంతి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఉమేష్‌కుమార్



వీసీ ఉమేష్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, అధ్యాపకులు



చరిత్ర

గంట స్తంభం.. గత వైభవ చిహ్నం

జగిత్యాల ప్రాశస్త్యాన్ని చాటుతున్న వైనం

జిల్లా వాసులను ఆకట్టుకుంటున్న నిర్మాణం

జగిత్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల గత వైభవానికి చిహ్నంగా క్లాక్ టవర్ నిలుస్తోంది. ఎన్నో ఆటుపోట్లు తట్టుకొని ప్రజలకు నేనున్నాంటూ పట్టణ నడిబొడ్డున ధీమాగా నాలుగు ముఖాల క్లాక్ టవర్ నిలిచింది. క్లాక్ టవర్ పట్టణ అందాన్ని మరింత ఇనుమడింపజేస్తోంది. దీనిని చల్‌గల్‌కు చెందిన 1936 సంవత్సరంలో ధర్మా జలపతి రావు దేశ్‌ముఖ్ నిర్మించారని స్థానికులు అంటున్నారు.

ఇందులోని గడియారం జర్మని నుంచి ప్రత్యేకంగా తయారు చేయించి తీసుక వచ్చారని చెబుతున్నారు. ప్రజలు ప్రాణాంతకమైన కలరా వ్యాధి నుంచి కోలుకున్న సందర్భంగా దాని నిర్మూలనకు సాక్ష్యంగా దేశ్‌ముఖ్ ధర్మా జలపతి రావు నిర్మించారని కథనం ప్రచారంలో ఉంది. గంట గంటకు మోగే ఈ గడియారం చదువురాని సామాన్యులకు సైతం సమయం తెలిసిపోయేలా ఏర్పాటు చేశారు. అయితే చారిత్రకమైన టవర్‌లో గల క్లాక్ ప్రస్తుతం మరమ్మతుకు గురై పనిచేయడం లేదు. తొలినాళ్లలో కాషాయం, తెలుపు రంగు పైభాగంతో సుమారు 60 అడుగుల ఎత్తయిన అష్టభుజి గోపురం దీని ప్రత్యేకత అని అంటున్నారు. స్తంభానికి ఎత్తయిన భాగంలో నాలుగు వైపుల కనిపించేలా గడియారం ఏర్పాటు చేశారు. ఈ తదుపరి కాలంలో దీనికి పలు పర్యాయాలు రంగులు మారాయి. పైన నీలి రంగు, చుట్టూ తెలుపు, యాష్ రంగులతో ప్రస్తుతం టవర్ ఉంది. పలు పండుగలు, దినోత్సవాల సందర్భంగా రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఈ చారిత్రక చిహ్నం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. జగిత్యాల పేరు చెబితే గుర్తుకు వచ్చే వాటిలో టవర్ కూడా ఒకటిగా గుర్తింపు పొందింది. పట్టణ నడిబొడ్డున గల టవర్ నాలుగు వైపుల ప్రధాన రహదారులు వాటికి ఇరువైపుల వ్యాపార, వాణిజ్య సముదాయాలున్నాయి. ప్రస్తుతం పనిచేయని గడియారం, సైరన్‌లను మరమ్మతు చేయాల్సిన అవసరముంది. పాలకులు పట్టించుకొని క్లాక్ టవర్ అభివృద్ధికి కృషి చేయా లని, టవర్ చరిత్రను, విశిష్టతను పర్యాటకులు తెలుసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కె.అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు విడుతల్లో భర్తీ చేయగా మిగిలిన సీట్లను వాక్ ఇన్ అడ్మిషన్స్ ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పదవ తరగతి పాసైన అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్ లో వెరిఫికేషన్ ఫీజు ఒక రూపాయి చెల్లించి ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గతంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోకుండా నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఇప్పటికీ సీట్లు కేటాయించిన వారికి వాక్ ఇన్ అడ్మిష న్స్‌లో అవకాశం లేదన్నారు. మరిన్ని వివరాలకు 7799100360, 9989182747 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎస్సారార్ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 21: ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈనెల 26 నుంచి 30 వరకు నిర్వహించనున్న దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ డిగ్రీ కళాశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల శాతవాహన యూనివర్సిటీలో నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల విశేష ప్రతిభకనబరిచిన ఎస్ వంశీ, ఎస్ సందర్శ్‌లు దక్షిణ భారత పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్ నాగేశ్వర్‌రావు తెలిపారు. విద్యార్థులను ఎస్సారార్ ప్రిన్సిపాల్ రామకృష్ణ అభినందించారు.

'భూమిని అక్రమంగా బదిలీ చేశారు'

కరీంనగర్ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం ఇరుకుల్ల గ్రామంలో ఉన్న తమ భూమిని వేరే వారికి అక్రమంగా బదిలీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బలుసుల అశోక్ కలెక్టర్‌కు, పోలీస్ కమీషనర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఇరుకుల్లలో సర్వే నెంబర్225,227, 232లో ఎకరం 21 గుంట భూమి అక్రమంగా బదిలీ చేశారని పేర్కొన్నారు.

పారమిత విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్‌టౌన్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): సౌత్ఇండియా సదరణ్ డ్రామా ఫెస్టివల్ కోసం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ డ్రామా పోటీల్లో భాగంగా మంకమ్మతోట పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నాటకం బెంగుళూరులో జరగనున్న సౌత్ ఇండియా సదరణ్ డ్రామా ఫెస్టివల్ పోటీలకు అర్హత సాధించారని పారమిత ప్రధానోపాధ్యాయులు బాలాజీ తెలిపారు. ప్రతిభ చూపిన అమితేశ్వర్, అర్జున్, సంప్రీతి, శ్రీనిధి, సమీక్ష, సుహృత, అనుశ్రీ, నాగ చైత్ర విద్యార్థుల బృందంను పారమిత అధినేత ప్రసాదరావు అభినందించారు.

జాతీయ విద్యావిధానాన్ని ఉపసంహరించుకోవాలి

సుభాష్‌నగర్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో జాతీయ విద్యా విధానాన్ని అమలు చేసే ఆలోచనలో ఉందని దానిని విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం అందచేశారు.

మాకు గూడు కల్పించండి..

-రాష్ట్ర ప్రభుత్వానికి లక్ష్మీపూర్ కాలనీవాసుల వినతి

కరీంనగర్ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలమైన తమకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కరీంనగర్ శివారు బొమ్మకల్ గ్రామంలోని లక్ష్మీపూర్ కాలనీలోని తాత్కాలిక గుడిసెలు వేసుకున్న పేదలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. లక్ష్మీపూర్ కాలనీలో కొంత మంది నిరుపేదలు 18యేళ్ళ క్రితం ప్రకృతి వైద్య చికిత్సాలయం సమీపంలో గుడిసెలు ఏర్పాటు చేసుకుని చీకట్లో మగ్గుతున్నారు. అక్కడ కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఇందిరమ్మ ఇళ్లు కావాలని, గత ప్రభుత్వంలో డబుల్ బెడ్‌రూము ఇళ్లు మంజూరు చేయాలని కలెక్టర్‌లకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీలో కనీసం మురికి నీరు, కరెంటు సరఫరాల లేకుండానే చీకట్లోనే ఉంటున్నామని తెలిపారు. కాలనీలో 50 నివాసాల్లో 150మంది ఇక్కడే నివాసం ఉంటున్నామని కనీసం పూరి గుడిసెలు, కట్టుకున్న ఇళ్ళకు కరెంటు దీపాలు కూడా లేక చీకట్లోనే మగ్గుతున్నామని తెలిపారు. బొమ్మకల్ స్టేజి నుంచి గ్రామం వరకు కనీసం మట్టి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారు.వెంటనే సంబంధిత అధికారులు అర్హులైన తమకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు, కరెంటు, రోడ్డు సౌకర్యం కల్పించి ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.


లక్ష్మీపూర్‌లో వేసుకున్న గుడిసెలు

18 ఏళ్లుగా చీకట్లోనే మగ్గుతున్నాం
-కాలనీవాసి, నారాయణ

లక్ష్మీపూర్‌లో గుడిసెలు ఏర్పాటు చేసుకుని 18యేళ్లుగా నివాసం ఉంటున్నాం. కూలి చేసుకుంటేనే మా పొట్ట నిండుద్ది. కొన్నేళ్ళుగా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఇందిరమ్మ ఇళ్ళు, డబుల్ బెడ్‌రూము ఇళ్ళను మంజూరు చేయాలని మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మాపై కనికరం చూపి గూడు కల్పించాలి. మాకు ఇళ్ళ పట్టాలు, కరెంటు, రోడ్డు సౌకర్యం కల్పించి మా కుటుంబాలను ఆదుకోండి.

ధ్వజారోహణం.. ఎదుర్కోలు ఉత్సవం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 21: జిల్లా కేంద్రంలోని యజ్ఞవరాహస్వామిక్షేత్రంలో 38వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ధ్వజారోహణం, చతుర్దశ కలశ స్నపనం నిర్వహించారు. సాయంత్రం ఎదుర్కోలు, అగ్నిప్రతిష్ట, హిరణ్యాక్ష సంహారలీల నేత్ర పర్వంగా కొనసాగాయి. రాత్రి శేషవాహనంపై శ్రీవారు ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. వెల్ది ధనశ్రీ, సల్వాజి సంధ్య, కెబి శర్మ బృందం, సుదర్శన్‌లచే భక్తి సంగీత విభావరులు అలంరించాయి. 13వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ శిష్యం బృందం నృత్యాలు మంత్ర ముగ్ధుల్ని చేశాయి. కార్యక్రమంలో సర్వవైదికసంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ పాల్గొన్నారు.


యజ్ఞవరాహస్వామిక్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

'యువత రాజకీయాల్లోకి రావాలి'

గణేశ్‌నగర్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): యువత రాజకీయాల్లోకి వచ్చి సమాజ అభివృద్ధికి పాటుపడాలని ఎన్‌టీఎస్ఎఫ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బుర్ర సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లోని పద్మనగర్‌లోని ఇందిరాగార్డెన్ లో నవ తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్‌టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఈసందర్భంగా ఉమ్మడి జిల్లా పట్టభద్రులు, విద్యార్థి యువతతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. త్వరలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్ యాదవ్ రాష్ట కార్యనిర్వాహక కార్యదర్శి దారం సతీష్ రెడ్డి , నాయకులు సాయి పటేల్, రాకేష్ , సంతోష్ , మహేశ్వర్ సాత్విక్ , దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించాలి

సుభాష్‌నగర్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం అనుమతుల కోసం చెల్లించిన ఫీజును తిరిగి ఇప్పించాలని నగరానికి చెందిన తూము శంకర్ కలెక్టర్‌కు సోమవారం ప్రజావాణిలో విన్నవించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం సుభాష్‌నగర్‌కు చెందిన తూము శంకర్ 23-02-2019లో సుభాష్‌నగర్‌లోని కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం మున్సిపల్ కార్పోరేషన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఆయనకు అనుమతులిచ్చిన అధికారులు 4లక్షల 36వేల965రూపాయలు ఫీజు చెల్లించాలని ఉత్తర్వులు ఇచ్చారు. అయితే అట్టి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి బ్యాంకు రుణం మంజూరు కాలేదు. దాంతో అట్టి కమ్యూనిటి హాల్ నిర్మాణం వాయిదా పడింది. అదే స్థలంలో ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోగా మున్సిపల్ అధికారులు అనుమతులు ఇచ్చి 6లక్షల 68వేల 507రూపాయలు చెల్లించాలని ఉత్తర్వులు ఇచ్చారు. దాంతో అధికారులు సూచించిన మొత్తాన్ని చెల్లించి ఫంక్షన్‌హాల్ నిర్మాణం చేశారు. తాను మొదటగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కట్టిన 4లక్షల 36వేల 965 రూపాయలను తిరిగి ఇప్పించాలని మున్సిపల్ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి తాను చెల్లించిన డబ్బులను తిరిగి ఇప్పించాలని బాధితుడు కోరాడు.

పంచాయతీ రికార్డుల తనిఖీ

కరీంనగర్ రూరల్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం డీఎల్‌పీవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఆదాయ, వ్యయాలు, ఇంటి పన్ను వసూళ్లు తదితర వివరాలు కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైకుంఠ దామం, నర్సరీలను పరిశీలించారు. డీఎల్‌పీవో వెంట ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి, కారోబార్ మురళి తదితరులు ఉన్నారు.

ఎవరికి వారే..

(5వ పేజీ తరువాయి)

తెస్తున్నట్లు తెలిసింది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చి తమ అనుచరులతో కమిటీలు ఏర్పాటు చేస్తే మొదటి నుంచి పార్టీలోనే ఉండి అధికారంలో లేనప్పుడు కష్టపడ్డ వారి పరిస్థితి ఏమిటని అసలు కాంగ్రెస్ వాదులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తాము ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్, హుజూరాబాద్ నియోజక వర్గాల్లో ఇందిరమ్మ కమిటీలను తమ కార్యకర్తలతో రూపొందించి జిల్లా యంత్రాంగానికి అందజేయాలని నిర్ణయించారని తెలిసింది. ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారులను ఎంపిక చేయడంలో క్రియాశీల పాత్ర వహిస్తాయి. సామాజిక తనిఖీలు చేసే అధికారాన్ని కలిగి ఉంటాయి. దీంతో ఈ కమిటీలకు రాజకీయంగా అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. కమిటీల్లో చోటు దక్కించుకోవడానికి కాంగ్రెస్ నాయకులు నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీల చుట్టు తిరుగుతూ ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ నెల 19న జిల్లా జిల్లా నుంచి రూపొందించిన జాబితాలు అందిన తర్వాత జిల్లా ఇన్‌చార్జి మంత్రి కమిటీలను ప్రకటిస్తారు. అప్పుడు ఏ కమిటీలు ఆమోదముద్ర పొందుతాయో, ఎవరి సిఫారసులు పనిచేశాయో తెలిసే అవకాశం ఉంటుంది.

ఎస్‌యూ వీసీని కలిసిన 'సుప్మా' కార్యవర్గం


వీసీ ఉమేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు

గణేష్‌నగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్‌ను సోమవారం శాతవాహన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్య అసోసియేషన్ (సుప్మా) కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాద రామక్రిష్ణ, అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీపాద నరేష్, అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వి రవీందర్‌రెడ్డి, అపూర్వ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వేణు, శివాణి డిగ్రీ కళాశాల అకాడమిక్ అడ్వైజర్ సతీష్, వాగ్దేవి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కృష్ణ, జగిత్యాల శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మునిపట్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

● బీసీ సంఘాల నాయకులు..

వీసీ ఉమేష్‌కుమార్‌ను బీసీ సంఘం నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసిపెద్ది శ్రీధర్ రాజు, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్, సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ మియాపురం రవీంద్రచారి, బీసీ యువజన సంఘం నగర అధ్యక్షులు అనుమాస నితిన్ పాల్గొన్నారు. బీసీ సంఘం నాయకులు దొగ్గలి శ్రీధర్, రాచమాల్ల రాజులు వీసీకి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 21: కరీంనగర్ పట్టణంలోని సెయింట్‌జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సోమవారం ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ మధుజాన్సన్ ఆధ్వర్యంలో అండర్-19 జూనియర్ కళాశాలల బాలబాలికల జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా డీఈఐవో జగన్మోహన్‌రెడ్డి, జూనియర్ ఆర్టిస్ట్ కాలేజీ ప్రిన్సిపాల్ సత్యవర్ధన్‌రావు, సెయింట్‌జార్జ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫాతిమారెడ్డిలు హాజరై ప్రారంభించారు.

మహారాష్ట్రలో తెలుగు సాహిత్య అకాడమీ ఏర్పాటు

-ముగ్గురు జిల్లావాసులకు చోటు

కరీంనగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహారాష్ట్రలో అక్కడి ప్రభుత్వం తెలుగు సాహిత్య అకాడమీని ఏర్పాటు చేసింది. ఆ రాష్ట్రంలో మూడు శతాబ్దాల వలస చరిత్ర ఉన్న తెలుగువారందరూ తెలుగు సాహిత్య అకాడమీ ఏర్పాటు కావడం గర్వకారణంగా భావిస్తున్నారు. 11 మంది కార్యవర్గం ఉన్న ఈ అకాడమీలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ముగ్గురికి చోటు దక్కడం విశేషం. మహారాష్ట్ర తెలుగు సాహిత్య అకాడమీ తొలి కార్యవర్గసభ్యులుగా జిల్లాకు చెందిన కవి, రచయిత సంగెవేని రవీంద్ర, జర్నలిస్టు గుండారి శ్రీనివాస్, కంటే అశోక్ నియమితులయ్యారు. వీరిలో సంగెవేని రవీంద్ర మహారాష్ట్రతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో సాహిత్యాభిమానులందరికీ సుపరిచితులే. ముంబాయిలోని ఆంధ్ర మహాసభలో క్రియాశీల పాత్ర నిర్వహిస్తూ వస్తున్న రవీంద్ర మహారాష్ట్రలో తెలుగు భాష అభివృద్ధి కోసం ఎప్పటి నుంచో కృషిచేస్తున్నారు. మహారాష్ట్ర తెలుగు పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ రచయితలకు చోటు కల్పించాలని రవీంద్ర అక్కడి గవర్నర్‌కు చేసిన వినతి కారణంగా ఆయన సానుకూలంగా స్పందించారు. తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారంతో పాటు రంగినేని ఎల్లమ్మ తదితర 32 అవార్డులు స్వంతం చేసుకున్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా విలాస్‌రావు దేశ్‌ముఖ్ ఉన్న సమయంలో ఆయన చేతుల మీదుగా కవి కళిదాసు అవార్డు అందుకున్నారు. రవీంద్రది ప్రస్తుత జగిత్యాల జిల్లా కాగా, అదే జిల్లా ధర్మపురికి చెందిన గుండారి శ్రీనివాస్ మరో సభ్యుడిగా నియమితులయ్యారు. మహారాష్ట్రలో ఇక్కడి నుంచి వెలువడుతున్న ఒక తెలుగు పత్రికకు బ్యూరో ఇంచార్జిగా పనిచేస్తున్నారు. మూడవ సభ్యుడైన కోరుట్లకు చెందిన కంటే అశోక్ ముంబాయిలో ఏకే మీడియా పేరుతో ఒక యూట్యూబ్ చానల్ సాహితీ సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారు.


రవీంద్ర


శ్రీనివాస్


అశోక్

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ రూరల్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులపై నిర్వహిస్తున్న గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సంజీవరావు అన్నారు. సోమవారం మండలంలోని దుబ్బపల్లి గ్రామంలో నిర్వహించిన ఉపాధిహామి గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో నిర్వహించే ఉపాధి హామి పనుల్లో భాగంగా పనులను గుర్తింపు చేసుకోవాలన్నారు. గ్రామానికి సరిపడా బడ్జెట్‌ను రూపకల్పన చేసుకుని తీర్మాణం చేసి పంపినట్లైతే ఆమోదం పొంది కూలీలకు పని దొరుకుతుందని ఎంపీడీవో తెలిపారు.

ఉపాధిహామీ పనుల్లో భాగంగా వ్యక్తిగత పనులకు కూడా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. పొలం గట్లపై మొక్కలు పెంచుకోవడంతో పాటు, షెడ్ల నిర్మాణం వంటి పనులకు ఉపాధిహామీ పథకంలో నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రామస్తులు ఉపాధి హామి గ్రామ సభలను వినియోగించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏపీఓ శోభరాణి, ఉపాధిహామి టీఏ, పంచాయతీ సెక్రెటరీ, గ్రామ నాయకులు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.


'నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్, బీజేపీ చెలగాటం'

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, బీజేపీ నాయకులు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని జిల్లా కాంగ్రెస్ బీసీసెల్ చైర్మన్ పులి ఆంజనేయులుగౌడ్ విమర్శించారు. డీసీసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉద్యమం పేరుతో ఆనాడు నిరుద్యోగులని బీఆర్ఎస్ రెచ్చగొట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ హయాంలో కేజీ నుంచి పీజీ పరీక్షల వరకు లీకేజీలు అయిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామిడి రాజిరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పులి ఆంజనేయులుగౌడ్

హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కంది తిరుపతిరెడ్డి

చిగురుమామిడి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డిని ఎంపిక చేసినట్లు ప్రభుత్వం నుంచి సోమవారం ఉత్తర్వులు వచ్చాయి. అనేక రోజులుగా కాంగ్రెస్ పార్టీలో క్రీయాశీలకంగా పనిచేసిన తన క్రమశిక్షణ, స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశీస్సులతో పదవి వచ్చిందని కంది తిరుపతిరెడ్డి తెలిపారు. తనకు సహకరించిన నాయకులకు, తన వెంట ఉన్న కార్యకర్తలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.


కంది తిరుపతిరెడ్డి

మానకొండూర్ పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

మానకొండూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలను సోమవారం జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రావు తనిఖీ చేశారు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు ప్రతిరోజు యూనిఫాం, బూట్లు ధరించాలన్నారు. ఒక పూట విద్యార్థులను చదివించి మరో పూట పరీక్షలు నిర్వహించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వాగేశ్వరిలో కళాశాలలో ఓరియెంటేషన్ ప్రోగ్రాం

తిమ్మాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాగేశ్వరి కళాశాలలో ఎంబిఏ, ఎంసిఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల జనరల్ సెక్రటరీ గండ్రా శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని అన్నారు. కళాశాల జాయింట్ సెక్రటరీ డి.శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చిగురుమామిడి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ముద్దసాని రమేష్, సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమాణరెడ్డి అన్నారు. సోమవారం సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 12 కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ఐకేపీ ఆధ్వర్యంలో కూడా కేంద్రాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంది తిరుపతిరెడ్డి, ఎంపిడిఓ ఎండీ ఖాజా మొయినొద్దీన్, ఐకెపి ఏపీఎం మట్టెల సంపత్‌కుమార్, సింగిల్ విండో డైరెక్టర్లు, హమాలీ సంఘాల నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 21: మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామంలో ఆర్టీసీ బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులకు బస్సు ఆపకుండా వెళ్లిన ఆర్టీసీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలంటూ ప్రయాణికులు ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఆర్డీనరీ బస్సు అయినప్పటికీ బస్సు ఆపకుండా వెళ్లడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చిందని, ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

కిట్స్‌లో ప్రెషర్స్ డే వేడుకలు

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 21 : మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ ప్రథమ సంవత్సర విద్యార్థుల ప్రెషర్స్ డే వేడుకలు సోమవారం జరిగాయి. ఈ వేడుకలకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ హాజరై మాట్లాడుతూ సాంకేతిక అంశాలపై విద్యార్థులు దృష్టి సారిస్తూ విద్యనభ్యసించాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఈశ్వరయ్య మాట్లాడుతూ కళాశాలలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ రమేష్ తదితరులు ఉన్నారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

మానకొండూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని స్థానిక సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. 21 నుంచి ఈ నెల 28 వరకు జరిగే పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సోమవారం మానకొండూర్‌లోని చెరువు కట్ట వద్ద ఎస్ఐ సంజీవ్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐ సంజీవ్ విధి నిర్వహణలో భాగంగా 2001 సంవత్సరంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ముకునూరు-తుపాకులగూడెం అడవులలో అసాంఘిక శక్తులతో పోరాడి వీరమరణం పొందాడని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు, మాజీ జడ్పిటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, సంజీవ్ సోదరులు ఉండింటి శంకరయ్య, ఉండింటి మల్లేశం, తిరుపతి, శ్యాంసన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● గంగాధర : గంగాధరలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అమర వీరుడు గుజ్జెటి మహేష్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం గుజ్జెటి మహేష్ తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. గంగాధర పోలీసులు పాల్గొన్నారు.

● చొప్పదండి: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని చొప్పదండి పోలీసు స్టేషన్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎస్ఐ అనూష, సిబ్బంది రక్తదానం చేశారు.


మానకొండూర్‌లో ఎస్ఐ సంజీవ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సీఐ లక్ష్మీనారాయణ


గంగాధరలో నివాళులర్పిస్తున్న ఎస్ఐ నరేందర్‌రెడ్డి

రైలు ఢీకొని మహిళ మృతి

జమ్మికుంట రూరల్, అక్టోబరు 21: జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామానికి చెందిన జొన్నల స్వరూప (41) గ్రామంలోని రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని సోమవారం మృతిచెందింది. స్వరూప పత్తి చేను వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో ఉన్న రైల్వేట్రాక్‌ను దాటేందుకు ప్రయత్నించింది. అప్పటికే వేగంగా వస్తున్న రైలు ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

జమ్మికుంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విలాసాగర్ మానేరు వాగు నుంచి జమ్మికుంటకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం స్వాధీనం చేసుకుని, యజమాని రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో జూనియర్ లైన్‌మన్ మృతి

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 21 : మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ బ్రిడ్జి వద్ద సోమవారం రాత్రి జూనియర్ లైన్‌మన్ మృతి చెందారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణానికి చెందిన మేదారి సాయిరమణ(34) శంకరపట్నం మండలం ఆముదాల పల్లి-మెట్‌పల్లి గ్రామాల జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలోనే విధులను ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరారు. ద్విచక్ర వాహనంపై తుమ్మనపల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ బ్రిడ్జి వద్దకు చేరుకున్నాడు. బ్రిడ్జి వద్ద కొత్తగా వేసి ఉన్న స్పీడ్ బ్రేకర్లు రాత్రిపూట కానరాక పోవడంతో వాహనం అదుపు తప్పింది. ఈ ఘటనలో సాయిరమణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థులు వెంటనే 108, పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని హుజూరాబాద్ ప్రభుత్వా సుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సాయిరమణ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు వివరాలను సేకరించారు. అనంతరం మృతుడిలో జేబులో ఉన్న ఆధార్ కార్డు ద్వారా తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అదిఇంచారు.


సాయిరమణ(ఫైల్)

పెద్దమ్మ దేవాలయానికి భూమి కేటాయించాలి

శంకరపట్నం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టులో శ్రీపెద్దమ్మ దేవాలయ నిర్మాణం కొరకు భూమి కేటాయించాలని కొత్తగట్టు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. అధ్యక్షుడు ఎడ్ల తిరుపతి, ఉపాధ్యక్షుడు పప్పు రాజు, కార్యదర్శి పిట్టల సమ్మయ్య, డైరెక్టర్లు ఎడ్ల తిరుపతి, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

చొప్పదండి,అక్టోబరు 21: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్ఐ విజయ భాస్కర్ అన్నారు. సోమవారం చొప్పదండిలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో జరిగిన డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు.

● ఇల్లందకుంట: మండలంలోని టేకుర్తి మోడల్ స్కూల్‌లో సోమవారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు జమ్మికుంట ఎక్సైజ్ ఎస్ఐ సౌమ్య డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ అయిలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనాన్ని వెంటనే పూర్తి చేయాలి

హుజూరాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావుపూలే భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరుతూ తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ 2018లో అప్పటి ప్రభుత్వం రూ. కోటి ఎస్సీ కార్పొరేషన్ నిధుల నుంచి మంజూరు చేయగా శంకుస్థాపన చేసి పునాది వరకు నిర్మాణం చేపట్టారన్నారు.

అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి జైలు శిక్ష, జరిమానా

రామడుగు, అక్టోబరు 21: బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి కరీంనగర్ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి పది సంవత్సరాల కారాగార శిక్ష విధించారు. బోయినపల్లి మండలంకు చెందిన సంపంగి ప్రేమ్‌కుమార్ బాలికపై అత్యాచారం చేయడంతో రామడుగు పోలీస్‌స్టేషన్‌లో 2022లో అత్యాచారం, పోక్సో కేసు నమోదు చేశారు. సాక్ష్యాదారాలు వాదనలు విన్న జడ్జి నిందితుడికి పదేళ్ల శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

సంక్షిప్తంగా

● హుజూరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ వెంకటస్వామి అన్నారు. సోమవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణను దేశంలోనే ముందుగా రాష్ట్రంలో అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణ లేకుండానే 11వేల టీచర్ పోస్టులను భర్తీ చేశారన్నారు.

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7వేలు పలికింది. ప్రైవేట్ ట్రేడర్స్ భహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7 వేలు, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించారు.

● రామడుగు: నిరుద్యోగులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే పట్టభద్రుల తరుపున పోరాడుతానని మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విన్నర్ స్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడారు.

● శంకరపట్నం: కేశవపట్నం పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. పరీక్షలో పట్టుబడ్డ ఆరుగురు వ్యక్తులను కోర్టులో హాజరు పరచగా ఒక్కో వ్యక్తి నుంచి రూ. వెయ్యి చొప్పున హుజూరాబాద్ సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఈశ్వరయ్య జరిమానా విధించినట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

● సైదాపూర్: రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని వెన్నంపల్లి పశువైద్యాధికారులు డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ విజేందర్‌రావు అన్నారు. సోమవారం సైదాపూర్ మండలంలోని లస్మన్నపల్లి, ఆరెపల్లి గ్రామాలలో 305 పాడి పశువులకు పశు వైద్య సిబ్బంది గాలికుంటు టీకాలు వేశారు.

● సైదాపూర్: మండల కేంద్రంలోని వెన్కేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం రూ. 2.50లక్షల వ్యయంతో నిర్మించిన టాయిలెట్‌లను ఎంపీడీవో యాదగిరి ప్రారంభించారు.

● రామడుగు: మండలంలోని కొక్కెరకుంటలో బూత్ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. బీజేపీ జిల్లా సభ్యత్వ నమోదు జాయింట్ కో ఆర్డినేటర్ జాడి బాల్‌రెడ్డి హాజరయ్యారు.

● జమ్మికుంట : మండలంలోని కోరపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న గుడిమిల్ల భలరాం టీచర్ ఎక్స్‌లెన్స్ అవార్డు- 2024 ను అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన శారద ఎడ్యూకేషన్ సొసైటీ అండ్ స్కైలైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డు అందించారు.